# ముచ్చటగా మూడు పువ్వులు

పాప ఏడవటంతో వంటింట్లోంచి గదిలోకి వచ్చింది సరోజ. ఉయ్యాలలోని పాపని చేతులలోకి తీసుకుని సముదా యించసాగింది. ఎంత సముదా యించినా ఊరుకోటంలేదు పాప. నిన్న పాలడబ్బా అయిపోయింది. ఆకలికి రాత్రంతా పాప ఒకటే ఏడుపు. పాపాయిని సముదాయించలేక పోతున్నది.

సరోజకు ఎందుకో విసుగ్గా ఉంది. పసిపాప మీద ఆమెకు ఎందుకో కోపం వస్తోంది. లత, సరళ తన నెపుడూ ఇంత పేచి పెట్టలేదు. వాళ్ళు ఒక్క క్షణం ఏడ్చినా తన హృదయం తల్లడిల్లి పోయేది. ఈరోజు చంటి పాప తెగ విసిగించేస్తోంది. ఇంత విసిగించటం ఏనాడూ ఎరుగదు.

ముఖం కడుక్కుని అప్పుడే అక్కడికి వచ్చిన ప్రభాకర్ "త్వరగా కాఫీ ఇవ్వు సరోజా! ఆఫీసుకు టైము కావొస్తూంది" అన్నాడు ఆమె చేతుల్లోంచి పాపని అందుకుంటూ. "పాలడబ్బా అయిపోయింది ఆఫీసు నుంచి వచ్చేటపుడు తీసుకురండి" భర్తకు కాఫీ అందిస్తూ అంది. "ఎలా సరోజా ఇంకా జీతాలు రావడానికి నాలుగు రోజులు ఉంది అన్నాడు ప్రభాకర్.

ప్రభాకర్ బ్యాంకులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. వైవాహిక

జీవితంలో అడుగుపెట్టిన ఆరు సంవత్సరాలలోనే ముగ్గురు బిడ్డల తండ్రి అయ్యాడు. ఇద్దరి కంటె ఎక్కువ పిల్లలు ఉంటే సరిగా పోషించలేను అని అనుకున్నాడు. రెండో పాప సరళ పుట్టినపుడు ఆ మాటే సరోజతో అన్నాడు. మగపిల్లవాడి కోసం ముచ్చట పడుతున్న సరోజ "బాబు పుట్టనివ్వండి" అంది. కాని వాళ్ళ ఆశలు ఫలించలేదు. మళ్ళీ ఆడపిల్లే పుట్టింది.

ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభాకర్ తను జీవితంలో పొరపాటు చేస్తున్నానేమో అని అనుకోసాగాడు. సరోజ కోరిక తీరేంత వరకు ఈ సంఖ్య ఇలాగే పెంచుకుంటూ పోతే తను అనుకున్నట్టు పిల్లలను సక్రమ మార్గంలో పెంచగలడా? వాళ్ళకు పెద్ద చదువులు చెప్పించి, వాళ్ళ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి కదా!

"ఆడపిల్ల మగపిల్లవాడి కన్న ఏ విషయంలో తక్కువ అసలు అతనికి ఆ అభిప్రాయమే లేదు. ఎవరినైనా తల్లితండ్రులు ఆప్యాయ తానురాగాలు పంచి పెంచగలిగితే చాలు" అనుకున్న అతను "బాబు కావాలి" అన్న సరోజ మాటను 'కాదు' అని అనలేకపోయాడు. ఫలితంగా మూడో బిడ్డకు తండ్రి అయ్యేడు. అమ్మాయిలైనా ముగ్గురు చాలు అని సచ్చచెప్పా లనుకున్నాడు.

దీర్ఘంగా ఆలోచిస్తున్న భర్త చేతుల్లోంచి ఖాళీ కప్పు తీసుకుని అతని చేతిలో పది రూపాయల కాగితం పెట్టింది సరోజ. ఆలోచనల నుండి తేరుకొని ఆశ్చర్యంగా చూశాడు ప్రభాకర్. "మిగిలిన ఖర్చులు అన్నీ మానేద్దాం ముందు పాలడబ్బా పట్టుకొచ్చేయండి అది ముఖ్యం కదా. చంటిది ఆకలికి తల్లడిల్లి పోతోంది." "అవును సరోజా అందుకే నాకుఏమనిపిస్తుందో తెలుసా ఈ ముగ్గురు చాలని, బాబుకోసం చూస్తే పిల్లల్ని సరిగా పెంచ

లేమేమో"భర్త మాట పూర్తి కాకుండానే పెంచటాని కేముంది మనకి బాబు కావాలండి అంది. మరేం బదులు చెప్పలేకపోయాడు ప్రభాకర్.

ప్రభాకర్ ఆఫీసుకు వెళ్ళిపోయాక లతను స్కూలుకు పంపి చంటి దాన్ని నిద్రపుచ్చి వంటపనిలో మునిగిపోయింది సరోజ. ప్రక్క వాటాలోని రాణితో సరళ ఆడుకుంటోంది? "అబ్బా; ఎంత బాగా పేర్చావే లక్క పిడతలు, ఇంక ఈ బొమ్మలన్నీ వరుసగా నేను పెడతాను" అంది రాణి. అలా కాసేపు ఆడుకున్నాక రాణి పరుగెత్తి ఇంటికి వెళ్ళి నాలుగు చాక్లెట్లు తెచ్చింది. రాణి చేతిలో చాక్లెట్లు చూసిన సరళ ఆట సామాను అలాగే వది లేసి దగ్గరకు వచ్చిన రాణితో 'నాకో' అంది ఆశగా. 'అబ్బా, నేనెందుకు ఇస్తాను', అంటూ చాక్లెట్లు వెనక్కి దాచేసుకుంది రాణి."నాలుగు ఉన్నాయిగా ఒకటి ఇవ్వవూ" చెయ్యిచాచి అడిగింది సరళ. "నేను మా అమ్మని అడిగి తెచ్చుకున్నాను. నువ్వు కూడా మీ అమ్మని అడిగి తెచ్చుకో" అంది హేళనగా.

నిండా నాలుగేళ్ళయినా లేని రాణి మాటలలోను, చేతలలోను కల వారి అమ్మాయిని అనే గర్వం తొణికిసలాడుతుంది. వనజకు తనకన్న తక్కువ స్థాయిలో ఉన్న వాళ్ళతో మాట్లాడటమన్నా, స్నేహం చేయట మన్న అసలు ఇష్టం ఉండదు. ఆ వాతావరణంలో పెరిగిన రాణికి తోటి పిల్లల్ని కించ పరచటం, వాళ్ళు చూస్తూవుండగా ఏమైనా తినటం అలవాటు అయింది. అందుకే సరళ విషయంలో కూడా అలా చేసింది. సరళ తల్లి దగ్గరకు పరుగు తీసింది."అమ్మా నాకు చాక్లెట్లుఇవ్వవూ"గోముగాఅడిగింది,

"ఇపుడు లేవు తరువాత ఇస్తాలే" అంది సరోజ."ఇపుడే కావాలి ఎంచక్కా వాళ్ళ రాణి తింటోంది." అని మారాం చేయటం మొదలు పెట్టింది. "వెళ్ళి ఆడుకోమ్మా, విసిగించకు" అంది సరోజ."నీకు మీ అమ్మ చాక్లెట్లు ఇవ్వ లేదని రాణి నన్ను ఏగతాళి చేస్తుంది నేనింక ఆడుకోను" ఏడుపు ముఖం పెట్టింది సరళ.

సరోజ మనస్సు చివుక్కుమంది. ఆ మాట నిజమే వనజ కూతురు సరళను అలాగే అంటుంది. పసిపిల్ల అయినా రాణి పెరిగిన వాతావరణం అలాంటిది. తన బిడ్డ ఏది అడిగినా కాదు అనదు వనజ. ఒక్కర్తే బిడ్డ కావటం వలన అతి గారాబంగా చూస్తుంది. ఆ పిల్ల ఎంత దురుసుగా ప్రవర్తించినా ఏమీ అనదు. కాని ఇపుడు తను సరళకు చాక్లెట్లు ఇవ్వటం ఎలా? 10 రు॥లు పాలడబ్బాకోసం భర్తకు ఇచ్చేసింది. పోనీ కొద్దిపాటి చిల్లరతో సరళకు చాక్లెట్లు కొనిపెట్టినా స్కూలునించి వచ్చిన లత సరళ లాగే తనకూ చాక్లెట్లు కావాలని మారాం చేస్తే – ఆలోచిస్తుంది సరోజ.

సరళ వరండాలోకి వెళ్ళినట్లుఉంది. రాణి సరళను ఏదో అంటోంది. వనజ మాటలు కూడా వినిపించటంతో తనూ బయటకు వచ్చింది సరోజ. "రాణీ, లోపలికిరా, వాళ్లింటికి ఎందుకు వెళ్ళావు? ఇంకా నువ్వు అక్కడే వుంటే ఆ రాక్షసి పిల్ల నీ చేతిలోంచి చాక్లెట్లు లాక్కొనేట్టు ఉంది చూడ బోతే"అంది బిగ్గరగా. "ఎందుకు అలా నోరు పారేసుకుంటావు మేమంత గతిలేని వాళ్ళమేమీ కాదు" అంది సరోజ. "అయితే నువ్వు నీ కూతురికి

అదుపులో పెట్టుకో మా అమ్మాయి చాక్లెట్లు అడుక్కుంటోంది" అంటూ విసురుగా వచ్చి రాణిని ఎత్తుకొని వెళ్ళిపోయింది వసజ.

సరోజకు దుఃఖము వచ్చింది. అది క్షణంలో కోపంగా మారి పోయింది. బిత్తరపోయి చూస్తున్న చిన్నారి సరళను "చాక్లెట్లు అడుక్కుం టావు పాడు ముఖమా" అంటూ నాలుగు దెబ్బలు వేసింది. వెక్కి వెక్కి ఏడుస్తూ గదిలో ఓమూలగా పడుకుంది సరళ. సరోజ మనస్సులో వసజ మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. "మీ అమ్మాయి మా అమ్మాయిని చాక్లెట్లు అడుకుంటోంది అంది" వసజ. అడుక్కోవటం అంటే ఆ పసిపిల్లకు ఏం తెలుస్తుంది. తోటి పిల్లను చాక్లెట్ అడిగింది. అంత మాత్రానికే వసజ అంతమాట అనాలా.

అసలు తనే పొరపాటు చేసింది. సరళతో ఆపేసి ఉంటే ఇద్దరినీ ఏ లోటూ లేకుండా పెంచగలిగేది. ఇప్పుడు పాప చాక్లెట్లు అడిగితే ఇవ్వ లేకపోలోంది. తను జీవితంలో మరో ఇద్దరు పిల్లల తల్లి అయితే—ఆఊహ సరోజ మనస్సులో భయాన్ని కల్గించింది. తనకు మరి పిల్లలు వద్దు. ఈ ముగ్గురూ చాలు అనుకొని ఒక నిర్ణయాని కొచ్చింది సరోజ. భర్త వచ్చే వేళకి ఇంటిపని అంతా ముగించేసుకుంది.

ఆఫీసు నుంచి వచ్చిన ప్రభాకర్ అందంగా అలంకరించుకొని తన కోసం ఎదురుచూస్తున్న భార్యను చూస్తూనే "ఏమిటి సరోజా, ఏమిటీ విశేషం" అన్నాడు. "విశేషమే మరి మీరు తెమలండి త్వరగా" అంటూ వంటింట్లోకి వెళ్ళింది. భార్య ఇచ్చిన కాఫీ త్రాగుతూ "ఇంతకీ ఇప్పుడు మనం ఎక్కడికి బయలుదేరుతున్నట్లు" "చెపితే మీరు ఆశ్చర్యపోరుగా,

డాక్టర్ దగ్గరకి" ప్రభాకర్ ముఖం వివర్ణమయింది. డాక్టర్ దగ్గరికి అంటే సరోజ మళ్ళీ అమ్మాయిని కాదుకాదు అబ్బాయిని-ఎవరినైతే నేం తలకు మించిన బరువే కదా! సరోజ గలగల నవ్వింది. "మీ కంగారు ఏమిటో నాకు అర్థం అయింది. నేను చెప్పబోయే విషయం మీకు ఆనందాన్ని కలిగిస్తుంది కానీ ఆందోళన కల్గించదు. మీరు అన్నట్టు మనకు ఈ ముగ్గురు చాలండి. ఆ విషయంలోనే డాక్టర్‌ని సంప్రదిద్దాం" "అదేమిటి సరోజా పొద్దున్నే బాబు కావాలన్నావుగా" ఆశ్చర్యంగా అన్నాడు ప్రభాకర్. "నేనే పొరపాటు పడ్డానండి ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు ఉంటేనే వారిని సక్రమ మార్గంలో పెంచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగలం, మన వలపుల పందిరికి ముచ్చటగా మూడు పువ్వులు చాలు" అంది.ప్రభాకర్ ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. ఆనందంగా భార్య చేతిని చేతిలోకి తీసుకున్నాడు.

* * *